క్లుప్తంగా

కుంభమేళాలో మాజీ ఎమ్మెల్యే పుణ్య స్నానం



కుంభమేళాలో పుణ్య స్నానం ఆచరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళాలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పుణ్య స్నానం ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా కుంభమేళా ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలకు గొప్ప సంగమం అన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దేశాన్ని ఏకం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. పుణ్యస్నానం ఆచరించిన తర్వాత గంగామాత, సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన సతీమణి, తెల్లం రాజ్యలక్ష్మి కూడా పుణ్యస్నానం ఆచరించి పూజలు చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు మంగళవారం రాత్రి రూ.1,00,000 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన చిలకలపూడి వీరవెంకట రాజేంద్రకుమార్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

విలీన సభను జయప్రదం చేయండి



ఐఎఫ్‌టీయూ సంఘాల విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: రాజమండ్రిలో మార్చి 2న నిర్వహించే ఐఎఫ్‌టీయూకు చెందిన రెండు సంఘాల విలీన సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ పిలుపునిచ్చారు. దేశంలో పలు ప్రాంతాల్లో పని చేస్తున్న రెండు కార్మిక సంఘాలు చర్చించి దేశ వ్యాప్తంగా విలీనమయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రెండు సంఘాలు మార్చి 2న రాజమండ్రిలో భారీ ప్రదర్శన బహిరంగ సభల ద్వారా విలీనం కావాలని నిర్ణయించాయన్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యవర్గం ముద్రించిన పోస్టర్లను జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, గంపల అబ్బులు, ముప్పిడి గంగారాం, పోడిదోలు దుర్గారావు, దున్న రామకృష్ణ, యడ్లపల్లి ఏసు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి: ఈ నెల 28వ తేదీన చింతలపూడి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి, టి.నరసాపురం, లింగపాలెం, శంఖు చక్రపురం, రాఘవపురం, సీతానగరం, శెట్టివారిగూడెం, ప్రగతి సోలార్, పట్టాయిగూడెం ఫీడర్ల పరిధిలో అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీ డీసీఎల్ జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. దీంతో బుధవారం త్రీ ఫేస్ కరెంట్ దశల వారీగా ఇస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్, ఇంజనీరింగ్ విభాగం ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా 28వ తేదీన జంగారెడ్డిగూడెం పట్టణంలో కార్మిక సంఘాలు, రాజకీయ సంఘాలతో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని మున్సిపల్ కార్మికులకు మద్దతు ఇవ్వాలని కోరారు.



పోలవరం రూరల్ : పట్టిసం శివక్షేత్రం వద్ద మెట్ల దిగువకు చేరిన క్యూలైన్



పోలవరం రూరల్ : నడకదారి ద్వారా పట్టిసీమ శైవక్షేత్రానికి వెళుతున్న భక్తులు



పోలవరం రూరల్ : పట్టిసం శివక్షేత్రం రేవులో మైలతెప్పలు విక్రయిస్తున్న వ్యాపారులు

హరహర మహాదేవ

- శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- భక్తులతో పోటెత్తిన పట్టిసం

పోలవరం రూరల్: ప్రసిద్ధి గాంచిన పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఊపందుకున్న భక్తుల రాక సాయంత్రం వరకు ఒకే రీతిలో సాగింది. భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానమాచరించి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పితృ దేవతలకు పిండ ప్రదాన కార్యక్రమం గోదావరి నదిలో మైలతెప్పలు వదిలారు. హరహర మహాదేవ శంబోశంకర అంటూ శివక్షేత్రం మారుమ్రోగింది. హోతా కుటుంబీకులు, బ్రాహ్మణ సమారాధన వారు, కొణతాల సోదరులు, మండవల్లి సోదరులు, కొత్తపట్టిసీమ గ్రామస్తులు ఉచిత అన్నదాన శిబిరాలు నిర్వహించారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు దర్శనాలు చేసుకున్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఆర్డీవో ఎంవీ రమణ, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, దేవస్థానం వద్ద ప్రత్యేక అధికారి విశ్వనాథరాజు, ఈవో సురేష్‌నాయుడు, తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, సీఐ సురేష్‌బాబు, ఎస్సై పవన్‌కుమార్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కొయ్యలగూడెం : భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తున్న దాతలు



బుట్టాయగూడెం : కుమ్మరిగట్టు శివాలయం వద్ద స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పంచాక్షరీ మంత్రంతో మార్మోగిన శైవ క్షేత్రాలు

కొయ్యలగూడెం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవ క్షేత్రాలు బుధవారం ఓంనమశ్శివాయ అంటూ పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. తెల్లవారు జాము మూడు గంటల నుంచి భక్తులు ఆలయాల వద్దకు చేరుకొని అర్చనాది, అభిషేక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

సర్వం శివమయం

బుట్టాయగూడెం: మహాశివరాత్రి పర్వదినాన నియోజకవర్గమంతా శివ నామస్మరణతో మారుమోగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడితో శివక్షేత్రాలు కిటకిటలాడాయి. మండలంలోని అతిపెద్ద శివక్షేత్రమైన త్రిపుర సుందరీ సమేత కామేశ్వర స్వామివారి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రెడ్డిగణపవరంలోని విశ్వేశ్వరస్వామి ఆలయం అదేవిధంగా కొమ్ముగూడెం కుమ్మరిగట్టు సమీపంలో ఉన్న ఉమా సహిత ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



వేలేరుపాడు : కాలినడకన గుట్టపై ఉన్న కట్కూరు ఆలయానికి వస్తున్న భక్తులు

ఆలయాల్లో ఘనంగా శివరాత్రి వేడుకలు

వేలేరుపాడు, మండలంలో గోదావరి తీరాన ఉన్న శివాలయాలు బుధవారం శివ నామస్మరణలతో మార్మోగాయి. మండలంలో నాలుగు శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కట్కూరు గుట్టపై ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ఐదు గంటల నుంచి భక్తులు పోటెత్తారు. ఉత్సవాల్లో సుమారు 15 వేల మంది భక్తులు తరలి వచ్చారు. రాత్రి ఏడు గంటలకు శివాలయంలో హోమం, కల్యాణ పూజలు చేశారు. కట్కూరులో వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ఎం,రామారావు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. తూర్పుగోదావరి జిల్లా భక్తులకు ఉచితంగా మూడు బోట్లు ఏర్పాటు చేశారు. ఆర్ఎక్స్ 100 సినీమా హీరో కార్తిక్ తండ్రి విఠల్ రెడ్డి భక్తులకు ఉచిత భోజనం, మంచినీటి సదుపాయాలను కల్పించారు. వేలేరుపాడుకు చెందిన మెడికల్ షాపు రాము, వీఆర్‌ఓ చీమల వెంకటేశ్వర్లు భక్తులకు ఉచితంగా మజ్జిగ, బెల్లం పానకం పంపిణీ చేశారు.

జనసంద్రంగా పట్టిసం శివ క్షేత్రం



పట్టిసం శివక్షేత్రంలో స్నానమాచరించేందుకు వేచి ఉన్న భక్తులు

పోలవరం రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలకు పట్టిసం శివక్షేత్రం భక్తులతో సంద్రంగా మారింది. అఖండ గోదావరి నది మధ్యలో గల స్వయంభుగా వెలసిన వీరేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. దీంతో నదీ తీరాన మూడు రోజుల పాటు నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాల తొలి రోజు ప్రశాంతంగా సాగాయి. అర్ధ రాత్రి ఒంటి గంట దాటిన తరువాత తొలి పూజ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ ఏడాది పట్టిసం రేవులో ఫెర్రీలో క్షేత్రం వద్ద చేపట్టిన ఏర్పాట్లు సత్ఫలితాలను ఇచ్చాయి. తొక్కిసలాటలు లేకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. పట్టిసం రేవులో ఏటిగట్టు రోడ్డుపై మాత్రం విద్యుత్ సౌకర్యం తక్కువైంది. దీంతో భక్తులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. సత్యసాయి సేవా సమితి కార్యకర్తలు భక్తులు తెచ్చుకున్న చెప్పులు బ్యాగులు భద్రపరిచారు. వైద్యాధికారులు నిరంతర పర్యవేక్షణ ద్వారా వైద్యం అవసరమైన వారికి సేవలు అందించారు. గురువారం కూడా భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

- ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రి పంపిణీ
- డివిజన్‌లో 23 పోలింగ్ కేంద్రాలు

జంగారెడ్డిగూడెం : ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జంగారెడ్డిగూడెం డివిజన్‌లో ఏర్పాట్లను పూర్తి చేశామని ఆర్డీవో ఆర్‌వీ రమణ తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం సంబంధించి ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటు వినియోగించుకునేలా జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో మొత్తం 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో పాటు, ఎన్నికల ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి చేర్చేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, పంపిణీ ప్రక్రియను ఆర్డీవో కార్యాలయ ఏవో శేఖర్ నిర్వహించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల ఎన్నికలకు సంబంధించి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్సైలను నియమించామన్నారు. 70 మంది సిబ్బందిని బందోబస్తుకు నియమించామన్నారు.

ఏర్పాట్లు పూర్తి

టి.నరసాపురం : మండలంలో శాంతియుతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి టి.సాయిబాబ తెలిపారు. మండలంలోని 918 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.

భోళా శంకరునికి భక్తుల నీరాజనాలు

- కిటకిటలాడిన శివాలయాలు
- తాడువాయిలో ప్రారంభమైన తిరునాళ్లు

జంగారెడ్డిగూడెం: పట్టణం శివరాత్రి శోభతో నిండిపోయాయి. భక్తులు శివాలయాలకు బారులు తీరారు. శివనామస్మరణ మధ్య ముక్కటిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాది పూజలు నిర్వహించుకున్నారు. మండలంలో దక్షిణ కాశీగా పేరొందిన స్వయంభూ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. మహాశివరాత్రితో పాటు ఐదు రోజుల పాటు నిర్వహించే తిరునాళ్ల ప్రారంభం రోజు కావడంతో జంగారెడ్డిగూడెం మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు తాడువాయి విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో నిండిపోయింది. శివాలయానికి ఆనుకుని ఉన్న ఎర్రకాలువ జలాశయం నీటిలో భక్తులు స్నానమాచరించి, పితృతర్పణాలు, మైలతెప్పలు వదిలారు. ఆలయంలో రుద్రాభిషేకం, నవగ్రహ మండపారాధన, బలిహరణ పూజలు, దీపాలంకరణ సేవలు నిర్వహించారు. గుర్వాయిగూడెంలో కొలువైన శివుడికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.



కామవరపుకోట: వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పూజలందుకున్న తాడువాయి వీరేశ్వరస్వామి వారు



లింగపాలెం: ధర్మాజీగూడెం శివాలయంలో అర్చకుల పూజలు



టి.నరసాపురం: ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి

నృత్య కళాకారిణి ప్రదర్శన

పట్టిసీమ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారి సన్నిధిలో జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంకు చెందిన నృత్య కళాకారిణి ప్రదర్శన నిర్వహించింది. శివరాత్రి తిరునాళ్లలో భాగంగా ప్రారంభం రోజున స్వామి వారిని సన్నిధిలో ఏర్పాటు చేసిన వేదికపై గుర్వాయిగూడేనికి చెందిన మంజుశ్రీ నృత్య ప్రదర్శన నిర్వహించి భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ ఈవో చాగంటి సురేష్ నాయుడు, సిబ్బంది మంజుశ్రీని సన్మానించారు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

టి.నరసాపురం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో మక్కినవారిగూడెం భువనేశ్వరి సమేత చంద్రశేఖర స్వామి వారి ఆలయంలో రాజుపోతేపల్లి, మల్లుకుంట శివాలయాల్లో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్మోగిన శివనామస్మరణ

లింగపాలెం: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాజీగూడెంగ్రామంలోని శివాలయంలో ఆలయ పూజారి ఈశ్వర ప్రసాద్ వర్మ శ్రీధర్మలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకమార్చనలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక వ్రతాలు,రుద్రహోమాలు ఆచరించారు. అనంతరం శివపార్వతులకు కల్యాణం చేశారు.



ద్వారకాతిరుమలలో శివయ్యను దర్శిస్తున్న భక్తులు

శివునికి ప్రత్యేక పూజలు

కామవరపుకోట : మండలంలో పలు శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తడికలపూడిలోని గంగేశ్వరస్వామి ఆలయంలో, తాడిచర్లలోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో, కామవరపుకోట శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శివలింగానికి పాలాభిషేకం, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, మహానివేదన, మంగళ నిరాజనం, కుంకుమార్చన, మంత్ర పుష్ప పూజలను వేదమంత్రాలతో ఆలయ అర్చకులు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

చింతలపూడి: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు శంభో శివ శంకర అంటూ శివ నామ స్మరణతో మార్మోగాయి. చింతలపూడి మండలంలో బుధవారం మహా శివరాత్రిని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. స్థానిక వేగిలింగేశ్వరస్వామి దేవాలయం, రేచర్ల, రాఘవాపురం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివరాత్రి సందర్భంగా భక్తులు శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు.



జంగారెడ్డిగూడెం : హైస్కూల్ వద్ద కొలువైన కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

క్షేత్రపాలకుని ఆలయానికి భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తుల రాక తెల్లవారు జాము నుంచి ప్రారంభమైంది. అలాగే ఆలయంలోని ఉసిరిచెట్ల వద్ద దీపాలను వెలిగించారు. గర్భాలయంలో కొలువైన శివదేవునికి ఆలయ అర్చకులు, పండితులు విశేష అభిషేకాలను నిర్వహించారు. రాత్రి లింగోద్భావ సమయంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని కల్యాణ మహోత్సవాన్ని భక్తుల శివనామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకి వాహనంలో క్షేత్ర పురవీదుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిలిచిన సత్యసాయి తాగునీరు

కొయ్యలగూడెం: సత్యసాయి తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు దాహార్తి తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కన్నాపురం అడ్డ రోడ్డు నుంచి గోదావరి జలాలు గోపాలపురం మండలం హుకుంపేట పంపింగ్ హౌస్‌కు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి సప్లై ఛానల్ ఒకటి, రెండు పైపులైన్ ద్వారా పలు మండలాలకు సత్యసాయి సాగునీటి సరఫరా కొనసాగుతుంది. అయితే ఇందులో సప్లై ఛానల్ ఒకటి నుంచి వెళ్లే పోలవరం మండలం పేట సమీపంలోని పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీని వలన పోలవరం, చింతలపూడి, నియోజకవర్గాలలోని మండలాలలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పంచాయతీలు ఏర్పాటు చేసిన ట్యాంకర్ల ద్వారా ప్రజలు నీటిని తీసుకెళుతున్నారు. సుమారు వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తవడానికి మరో నాలుగు రోజులు పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



పైప్‌లైన్ ఆగిపోవడంతో ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని పట్టుకుంటున్న ప్రజలు

వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. మండలంలోని పంగిడిగూడేనికి చెందిన సింహాద్రి శేషారెడ్డి, సుబ్బలక్ష్మిలకు 12 సంవత్సరాల క్రితం వివాహమైందని తెలిపారు. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నం, సారె, ఆడపడుచు కట్నం మరో రూ.2 లక్షలు తన తల్లితండ్రులు ఇచ్చినట్లు సుబ్బలక్ష్మి ఫిర్యాదులో పేర్కొందన్నారు. అయితే అదనపు కట్నం తీసుకురమ్మని తనను మానసికంగా, శారీరకంగా భర్త శేషారెడ్డి, అతడి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాయి దివ్య రథంతో పాదయాత్ర



ద్వారకాతిరుమలకు పాదయాత్రగా చేరుకుంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: ఏలూరులోని తూర్పు వీధి షిరిడీ సాయి మందిరం నుంచి సుమారు 10 వేల మంది భక్తులు బుధవారం ద్వారకాతిరుమల చిన వెంకన్న దివ్య క్షేత్రానికి పాదయాత్రగా విచ్చేశారు. దీంతో ఈ యాత్ర ప్రారంభమై 19 ఏళ్లు పూర్తయింది. ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినం నాడు ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉదయం ఏలూరులోని షిరిడీ సాయి మందిరం నుంచి రథంతో ప్రారంభమైన వారి పాదాయత్ర తడికలపూడి, రామన్నగూడెం మీదుగా రాత్రికి క్షేత్రానికి చేరుకుంది. మేళతాళాలు మంగళ వాయిద్యాలు, బాబా సంకీర్తనల నడుమ రథాన్ని లాగుతూ భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత రథాన్ని స్వామివారి పాదుకామండపం వద్ద ఉంచి, విశేష పూజలు నిర్వహించి, బాబా గీతాలాపనలు చేశారు. ఇదిలా ఉంటే దారిపొడవున భక్తులకు పలువురు దాతలు మజ్జిగ, మంచినీరు, అల్పాహారం, పండ్లను అందజేశారు.

ఎక్సైజ్ దాడులు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

చింతలపూడి: తలార్లపల్లిలో బుధవారం నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. దేశావతు వేణుకు సంబంధించిన ప్లాస్టిక్ డ్రమ్‌లలో నిల్వ ఉంచిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, నిందితుడుపై కేసు నమోదు చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. రాఘవాపురంలో పెంకే విజయ్‌కుమార్ వద్ద 3 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.